క్లుప్తంగా

శ్రీ చైతన్య విద్యార్థులకు అభినందన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఐఎన్‌టీఎస్ఓ నాసా నిర్వహించిన పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థులు రాణించడం అభినందనీయమని శ్రీ చైతన్య ఏజీఎం మురళీకృష్ణ పేర్కొన్నారు. కేటీ రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం అభినందించింది. ప్రపంచ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో స్కూల్‌కు చెందిన విద్యార్థులు 2,3,4,5 తో పాటు 32 కన్సొలేషన్ బహుమతులను అందుకున్నారన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆర్ఐ రాజేష్, ప్రిన్సిపాల్ హేమంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ భవానీ ఐలాండ్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా దిగువ పేర్కొన్న ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలియ చేశారు. గురువారం ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు భవానీపురం కరకట్ట రోడ్, ఆలివ్ ట్రీ హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంబాడీపేటకు చెందిన సీహెచ్ నిర్మలజ్యోతి, రవిప్రసాద్ భార్యభర్తలు. రవిప్రసాద్‌కు గతంలోనే వివాహం కాగా మొదటి భార్య చనిపోవడంతో నిర్మలజ్యోతితో రెండో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.6 లక్షల కట్నం ఇచ్చారు. కొంతకాలంగా నిర్మలజ్యోతిని భర్త రవిప్రసాద్‌తో పాటు అత్త వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నేడు వీఎంసీ కౌన్సిల్ సమావేశం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ సభ్యుల సర్వసాధారణ సమావేశం గురువారం జరగనుంది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన గురువారం ఉదయం 10.30 గంటలకు వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో జరగనున్న ఈ సమావేశంలో అజెండాలోని మొత్తం 53 అంశాలపై కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు చర్చించి తీర్మానాలు చేయనున్నారు.

ఈతలో వేసవి శిక్షణ తరగతులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వీఎంసీ మూడు సర్కిళ్ల పరిధిలోని స్విమ్మింగ్ పూల్స్‌లో చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే రెండవ తేదీ సర్కిల్–1 పరిధిలోని చిట్టినగర్‌లో డాక్టర్ కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్, సర్కిల్–2 పరిధిలోని గాంధీనగర్ సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్, సర్కిల్–3 పరిధిలోని గురునానక్ నగర్ స్విమ్మింగ్ పూల్‌లో మే 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు స్థానికంగా ఉన్న స్విమ్మింగ్ పూల్స్ ఇన్‌చార్జిలను సంప్రదించాలని సూచించారు.

వార్డు వలంటీర్లకు ఇంటర్వ్యూలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 28వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. "సత్యనారాయణపురం సర్కిల్–2 పరిధి జోనల్ కమిషనర్ కార్యాలయం, పటమట సర్కిల్–3 జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆయా వార్డులకు సంబంధించి అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రంలో అర్హత ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, వివరాలకు స్పెషల్ అధికారి(వార్డు సెక్రటేరియట్స్) లేదా 8185933187 నంబర్ల సంప్రదించాలని సూచించారు.

గ్రూప్–1,2 అభ్యర్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించనున్న గ్రూప్–1, 2 పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులకు తమ సంస్థ ఆధ్వర్యంలో స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నామని ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణ ప్రదీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మే 7 వ తేదీ ఆదివారం ఆన్‌లైన్‌లో ఈ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి గ్రూప్–1, 2 పరీక్షలకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తామని, రిజిస్ట్రేషన్, సిలబస్ వివరాలకు 91332 37733, 91336 37733 నంబర్లలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

రూ.కోట్ల నిధులతో నియోజకవర్గ అభివృద్ధి

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా 43వ డివిజన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లాది రూపాయల నిధులతో పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఊర్మిళానగర్ 43వ డివిజన్‌లోని ఏకలవ్య నగర్ 140వ నంబరు సచివాలయం పరిధిలో బుధవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సచివాలయ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడాను వివరించారు. స్వయంగా ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. డివిజన్ పరిధిలోని డ్రెయిన్లు, ఖాళీ ప్రదేశాలను పరిశీలించారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి చక్కటి స్పందన లభిస్తోందన్నారు. ప్రజలు తామే ముందుకు వచ్చి ఈ ప్రభుత్వంలో తమకు చేకూరిన లబ్ధిని వివరిస్తున్నారన్నారు. డివిజన్‌లో రూ.24 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే రూ.12 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. ఐరన్ యార్డ్‌లో వర్కర్లకు మరుగుదొడ్లను కూడా నిర్మించారన్నారు. ఈ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్ ఉన్నాడనే ఉద్దేశంతోనే గత టీడీపీ ప్రభుత్వం ఇక్కడ అభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు.

సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో నియోజకవర్గంలోని అన్ని డివిజన్లకు సమప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. నగరాన్ని అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, పార్టీ నాయకులు బట్టిపాటి శివ, కట్ట సత్తయ్య, కంది శ్రీనివాసరెడ్డి, మాదాల తిరుపతిరావు, పువ్వుల కాంతారావు, మద్దెల రామకృష్ణ, కనకం వెంటేశ్వర్లు యాదవ్, మాగం ఆత్మారాం, ఎస్వీ రెడ్డి, తిరుపతి రెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి, ముద్దు లక్ష్మి, కె.రమాదేవి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

చెస్ పోటీలను జయప్రదం చేయాలి

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



చెస్ పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జూనియర్ చెస్ అకాడమీ, విజయవాడ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే నెల 18 వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నగరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్ ఉమెన్స్ ఫిడే రేటింగ్ చెస్ పోటీలను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఫిడే రేటింగ్ చెస్ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఢిల్లీరావు ఆవిష్కరించారు. నగరంలోని గురునానక్ కాలనీ నందు గల రోటరీ మిడ్ టౌన్ విజయవాడ, గేట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్సెస్‌లో నిర్వహించే ఈ పోటీలలో జిల్లాకు చెందిన చెస్ క్రీడా కారులు పాల్గొని ప్రతిభ చూపాలన్నారు. జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె. శ్రీనివాసరావు, జూనియర్ చెస్ అకాడమీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.డి అక్బర్ పాషా, మందుల రాజీవ్, మేనేజర్ గోపిక నాగసాహితి,తదితరులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించిన సీడీసీ బృందం



పాత ఆస్పత్రిలోని వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించిన సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ బృంద సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పాత ప్రభుత్వాస్పత్రిలో వాలంటరీ హెల్త్ సర్వీస్(వీహెచ్‌ఎస్) ఆధ్వర్యంలో రెండేళ్లుగా నిర్వహిస్తున్న వన్‌స్టాప్ సెంటర్‌ను బుధవారం సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్(సీడీసీ) బృందం సందర్శించింది. అట్లాంటాలోని హెడ్‌క్వార్టర్స్ ప్రతినిధులతో పాటు, సీడీసీ ఇండియా బృంద సభ్యులు సందర్శించగా, వారితో పాటు, జిల్లా అధికారులు కూడా ఉన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి సహకారంతో రెండేళ్లుగా నిర్వహిస్తున్న వన్‌స్టాప్ సెంటర్‌లో ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్స్ ఆరోగ్య, సామాజిక, న్యాయపరమైన సేవలను అందిస్తున్నారు. సెంటర్‌లో సేవలు ఎలా అందుతున్నాయి, వాటిని ఎంత మంది వినియోగించుకుంటున్నారు, ఎంతమంది ప్రయోజనం పొందారనే అంశాలను సీడీసీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సామాజికంగా టీజీ ఐడీ కార్డ్స్, పెన్షన్లు, వివిధ రకాల వృత్తి విద్య నైపుణ్యాల శిక్షణ వంటి అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీడీసీ హెడ్‌క్వార్టర్స్ ప్రతినిధి డాక్టర్ హన్నా డిమికీ, ఇండియా ప్రతినిధులు డాక్టర్ తరుణ్, డాక్టర్ సుధార్, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ జె.ఉషారాణి, వీహెచ్‌ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ విలియమ్స్ జోసఫ్, డాక్టర్ విజయ రామన్, డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, ప్రియా, వెంకట్, ప్రశాంతి, అపర్ణ, కృష్ణమూర్తి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

30న కార్మిక సాంస్కృతిక ఉత్సవాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గుండు నారాయణరావు తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మేడే దినోత్సవాన్ని పురస్కరించుకుని జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన కార్మిక సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నామని జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు తెలిపారు. విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండు నారాయణరావు మాట్లాడుతూ అంతర్జాతీయంగా కార్మికులు 8 గంటల కోసం పోరాడి సాధించుకున్న రోజు మేడే అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 30న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్విరామ కళారూపాల ప్రదర్శన జరుగుతుందన్నారు. బ్యాంకు ఆఫీసర్ల నుంచి భవన నిర్మాణ కార్మికుల వరకు అన్ని రకాల ఉద్యోగ, కార్మికులు వారి కుటుంబ సభ్యులు సంఘటితంగా కళారూపాలు ప్రదర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ప్రారంభిస్తారని, నగరంలోని వివిధ కార్మిక సంఘాలు 42 సాంస్కృతిక రూపాలను ప్రదర్శిస్తారని తెలిపారు. లఘు నాటికలు, జానపద నృత్యాలు, కోలాటం, పాటలు, పద్యాలు, వెస్టన్ డాన్స్, ప్రజా పాటకు శాస్త్రీయ నృత్యం, మిమిక్రీ, ఏకపాత్రలు తదితర కళారూపాలు ప్రదర్శిస్తారన్నారు. కార్మిక, ఉద్యోగ సంఘాల కుటుంబ సభ్యులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బడే హజరత్ ఉరుసుకు పయనం



పెండ్యాలలో ఎడ్లబండిపై ఉరుసుకు పయనమైన ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల: ప్రతి ఏడాది అత్యంత భక్తిశ్రద్ధలతో ముస్లింలు బడే హజరత్ ఉరుసు జరుపుకుంటారు. మండలంలోని పెండ్యాల మున్నేటి తీరాన ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు ఎడ్లబండి ఎక్కి ఉరుసును బుధవారం ప్రారంభించారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల నుంచి ఈ ప్రాంతానికి వచ్చి ముస్లింలు బండెనెక బండికట్టి వరసగా ఉత్సవాలకు తరలివెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ, ఉరుసు ఉత్సవాలను మతాలకు అతీతంగా హిందువులతో కలసి ముస్లింలు జరుపుకుంటారని తెలిపారు. ముస్లింలు ఉరుసుకు వెళ్లేందుకు హిందువులు ఎద్దుల బండ్లను ఉచితంగా ఇస్తారని వారితో పాటే ఉత్సవాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా చీరాల, బాపట్ల, చిలకలూరిపేట, వినుకొండ, గుంటూరు, కృష్ణాజిల్లా చల్లపల్లి, అవనిగడ్డ, తెలంగాణా రాష్ట్రం ఖమ్మం, నల్గొండ, మిర్యాలగూడ, వైరా, మధిర, సూర్యాపేట తదితర ప్రాంతాల నుంచి పెండ్యాల గ్రామానికి చెందిన ముస్లింలకు ఉచితంగా ఎడ్ల బండ్లను కడతారు. ఉరుసు ఉత్సవాల్లో వారు పాల్గొంటారు. నాలుగు వందల ఏళ్ల నుంచి ముస్లింలు ఈ ఉత్సవాల్లో పాల్గొని అత్యంత భక్తిశ్రద్ధలతో తుర్లపాడులో ఉన్న బడేమియా హజరత్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. ఆంధ్ర, తెలంగాణా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఉన్న పెండ్యాల గ్రామానికి చెందిన ముస్లీం సంతతికి చెందిన వారంతా ఈ వేడుకల్లో పాల్గొనేందుకు సుదూర ప్రాంతాల నుంచి బస్సులు, రైళ్లు, విమానాల్లో వస్తుంటారు. ఈ ఉత్సవాలు చందర్లపాడు మండలంలోని తోటరావులపాడులో కొలువై ఉన్న బడే మియా తమ్ముడిని ప్రార్థించి అక్కడ నుంచి సాయంత్రానికి తుర్లపాడు చెరువులో ఉన్న బడేమియా హజరత్ దర్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు జరుపుకుంటారు. చిన్నా పెద్దా తేడాలేకుండా ఆ సంతతికి చెందిన ముస్లింలంతా ఐక్యంగా ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. అంతేకాకుండా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనేందుకు కులమతాలకు అతీతంగా అన్ని మతాల వారు ఎడ్లబండ్లపై వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

మజ్జిగ, వాటర్ బాటిళ్ల పంపిణీ..

ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ ఆధ్వర్యంలో మున్నేటి తీరాన ఉర్సు ఉత్సవాలకు ఎడ్లబండ్లపై వెళ్లుతున్న భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు వాటర్ బాటిళ్లు ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు చేతులమీదుగా పంపిణీ చేయించారు. ఉరుసు ఉత్సవాలకు తరలి వెళ్తున్న ముస్లింలు ఎద్దుల సవారిలను చూసేందుకు పెండ్యాల మునేటి తీరాన ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు.

ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలో అదితి ప్రతిభ

- బైపీసీలో 440 మార్కులకు 428 మార్కులు
- గ్రూప్ సబ్జెక్ట్సులో నూరు శాతం మార్కులు



అదితి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా కుమార్తె అదితి ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. అదితి గోశాలలోని చైతన్య కళాశాలలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో 440 మార్కులకు గాను 428 మార్కులు సాధించింది. గ్రూపు సబ్జెక్ట్స్ బోటనీలో 60 కి 60, ఫిజిక్స్‌లో 60 కి 60 మార్కులు, జువాలజీలో 60 కి 60, కెమిస్ట్రీలో 60కి 60 మార్కులు సాధించింది. అదితిని జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతర శాఖల జిల్లా అధికారులు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీభవిష్య విద్యార్థుల ప్రతిభ



అమృత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇంటర్మీడియెట్ ఫలితాల్లో తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని శ్రీ భవిష్య జూనియర్ కళాశాల డైరెక్టర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో బాన అమృత, శీలం వైష్ణవి 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించారని, 460 మార్కులకు పైగా 19 మంది విద్యార్థులు సాధించారని తెలియజేశారు. బైపీసీ విభాగంలో గీతాశ్రీ 440 మార్కులకు గాను 436 మార్కులు పొందిందని, 430కి పైగా మార్కులను 21 మంది విద్యార్థులు సాధించారని తెలియజేశారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో జి.సత్య లిఖితారెడ్డి, లక్ష్మి చర్విత వెయ్యి మార్కులకు 986 మార్కులు పొందారని తెలిపారు. 980 మార్కులకు పైగా 10 మంది, 970 మార్కులకు పైగా 31 మంది, 950కి పైగా మార్కులను 68 మంది విద్యార్థులు పొందారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన కుమారుడు కనిపించడం లేదంటూ తల్లి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రకట్ట మసీదు ప్రాంతానికి చెందిన కొరుసు లక్ష్మీపార్వతి, రంగా భార్యభర్తలు. వీరికి హేమంత్(16) అనే కుమారుడు ఉన్నాడు. ఈ నెల 24వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లిన హేమంత్ రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లి లక్ష్మీ పార్వతి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భార్యపై ఇటుక రాయితో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యపై ఇటుక రాయితో దాడికి పాల్పడిన భర్తపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెంగట్టు జోడు బొమ్మల సెంటర్ ప్రాంతానికి చెందిన దనియాల దుర్గ, వెంకట శాంతసాగర్ భార్యభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. శాంతసాగర్ ఏలూరు రోడ్డులోని ఓ హోటల్‌లో పని చేస్తుండగా, దుర్గ షాపింగ్ మాల్‌లో పని చేస్తుంటుంది. మద్యం అలవాటు ఉన్న శాంతకుమార్ రోజు భార్యను హింసిస్తుంటాడు. ఈ నెల 25వ తేదీ రాత్రి డ్యూటీ నుంచి దుర్గ ఇంటికి వచ్చేసరికి భర్త శాంతకుమార్ మద్యం తాగి నిద్రపోతున్నాడు. దుర్గ భర్తను లేపి ఎందుకు తాగావని నిలదీయడంతో శాంతకుమార్ పక్కనే ఉన్న రాయి తీసుకుని దుర్గపై దాడి చేశాడు. దీంతో దుర్గ తలకు గాయం అయింది. బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణికి అభినందన

జగ్గయ్యపేటఅర్బన్: ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారు ఈనెల 22న విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన 10వ అంతర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల విద్యార్థిని ఎం.తిరుపతమ్మ ప్రతిభ కనపరచింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.అంకయ్య తదితరులు విద్యార్థినిని అభినందించారు.

మాతా శిశు మరణాలపై సమీక్ష



మాతా శిశు మరణాలపై సమీక్ష చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలో మార్చి నెలలో జరిగిన మాతృ, శిశు మరణాలపై బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమీక్ష నిర్వహించారు. మార్చి నెలలో రెండు మాతృ మరణాలు, నాలుగు శిశు మరణాలు సంభవించగా, అందుకు గల కారణాలు, వారి ఆరోగ్య పరిస్థితిపై సమావేశంలో విశ్లేషణ చేశారు. వాళ్లు ఆస్పత్రికి వచ్చేసరికి ఆరోగ్య పరిస్థితి, అందించిన చికిత్స వివరాలు, మరణానికి గల కారణాలను విశ్లేషించారు.

సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నళినీదేవి, పాత ప్రభుత్వాస్పత్రి గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివరంజని, జనరల్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ నాగ చక్రవర్తి, జిల్లా ప్రజారోగ్య నర్సింగ్ అధికారి లిడియా, ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం



శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్ల కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. తొలుత స్వామి వారి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులతో ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు కళావేదిక వద్దకు చేరుకోగా, ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ ఉత్సవంలో పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తుల ఇంట సకల శుభాలతో పాటు వివాహం కాని వారికి వివాహ యోగం, సంతానం లేని వారికి సంతాన యోగం కలుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

శబ్దకాలుష్యంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



శబ్దకాలుష్యంపై జరిగిన సదస్సులో ఐఎంఏ, ఈఎన్‌టీ సర్జన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పారిశ్రామిక శబ్దకాలుష్యం మనిషి ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని, దీనిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఈఎన్‌టీ సర్జన్స్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో బుధవారం అంతర్జాతీయ శబ్ద కాలుష్య అవగాహన దినోత్సవం నిర్వహించారు. ప్రతిఏటా ఏప్రిల్ చివరి బుధవారం ఈ అవగాహన దినోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది 'వినికిడి శక్తి రక్షించుకోండి..ఆరోగ్యాన్ని కాపాడుకోండి' అనే నినాదంతో ప్రజలకు శబ్దకాలుష్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఏ నగరశాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎంఏ రెహమాన్, డాక్టర్ దుర్గారాణి మాట్లాడుతూ శబ్దకాలుష్యంతో ఉత్పన్నమయ్యే పరిణామాల గురించి వివరించారు. నేడు జీవన విధానంలో అనేక మార్పులు జరుగుతున్నాయని, వాణిజ్య కాలుష్యం, మతపరమైన కాలుష్యం, పబ్‌ల పేరిట సంగీత కాలుష్యం ఇవన్నీ జనజీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయన్నారు. రోడ్లపై యువత విన్యాసాలు చేస్తూ వెలువరుస్తున్న శబ్దకాలుష్యం తీవ్రమైన ప్రభావం చూపుతుందన్నారు. ఈ శబ్దకాలుష్యం శారీరకంగా, మానసికంగా తీవ్రమైన ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శబ్దకాలుష్యానికి దూరంగా ఉండటం, దాని బారిన పడకుండా చెవులకు రక్షణ పరికరాలు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పి.శ్వేత, డాక్టర్ బోడేపూడి చౌదరి, డాక్టర్ పీఎస్ఎన్‌మూర్తి, డాక్టర్ కె.శివరామకృష్ణ, డాక్టర్ పీవీ మధుసూదనశర్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సహస్ర చండీయాగం

లోక కల్యాణార్థం యాగం, కుంభాభిషేకం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌రెడ్డి, గజల్ శ్రీనివాస్ తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో వారం రోజుల పాటు సహస్ర చండీయాగం, కుంభాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి తెలిపారు. పాలప్రాజెక్టు సమీపంలోని శక్తిపీఠం ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్సవాల ఏర్పాట్ల గురించి గౌతమ్‌రెడ్డి మాట్లాడారు. ప్రజల యోగక్షేమాలను కాంక్షిస్తూ, సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో రైతులందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటూ ఈ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. సహస్ర చండీయాగం సందర్భంగా 72 అడుగుల భారీ చండీ అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. తొలి రోజు గురువారం పలువురు రాష్ట్ర మంత్రులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు. సేవ్ టెంపుల్ భారత్ సంస్థ నిర్వాహకులు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలు మే 3వ తేదీ వరకు జరుగుతాయన్నారు. చండీయాగం, కుంభాభిషేకాలలో పెద్ద ఎత్తున భక్తులు, ప్రజలు పాల్గొనాలని కోరుతున్నామన్నారు. పీఠాధిపతి కరుమారి దాసు మాట్లాడుతూ గంగా పుష్కరాలు జరుగుతున్న సమయంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలలో పాల్గొన్న వారికి పలువురు పీఠాధిపతులు ఆశీర్వచనాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లఖంరాజు సునీత, కళ్యాణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాలలో డార్విన్ సిద్ధాంతం తొలగించడం దుర్మార్గం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్



ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల వద్ద నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): డార్విన్ సిద్ధాంతాన్ని తప్పుడు సిద్ధాంతంగా వక్రీకరించేందుకు మతోన్మాదులు చేస్తున్న ప్రయత్నాలు తిప్పికొట్టాలని, సీబీఎస్ఈ పాఠ్యాంశాలలో డార్విన్ సిద్ధాంతాన్ని కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సీబీఎస్ఈ సిలబస్ నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించినందుకు బుధవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కర్ణాటక రాష్ట్రంలో బ్రిటీష్ క్షమాభిక్ష కోరిన సావర్కర్ పాఠ్యాంశం తీసుకు వచ్చారని, ఇప్పుడు డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, నాయకులు రాజుకుమార్, భార్గవ్, శైని పాల్గొన్నారు.

30న ఏకలవ్య పాఠశాల ప్రవేశ పరీక్ష

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఎన్టీఆర్ జిల్లాలో ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు ఈ నెల 30న కొండపల్లి రాష్ట్ర గిరిజన గురుకుల సంక్షేమ బాలికల పాఠశాలలో ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ http:aptwf urukuam.ap.gov.in/ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. 7,8,9 తరగతుల్లో ఉన్న బ్యాగ్‌లాగ్ ఖాళీలకు గిరిజన బాలబాలికలు మాత్రమే అర్హులని తెలిపారు. వివరాలకు 83339 25169, 80743 25656లో సంప్రదించాలని కోరారు.

- విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని ఘంటసాల వేంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాల 63వ వార్షికోత్సవాన్ని ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ గోవిందరాజన్ బుధవారం తెలిపారు. కార్యక్రమంలో కర్ణాటక సంగీత విద్వాంసురాలు పాటిబండ్ల జానకిని ఆత్మీయంగా సత్కరిస్తున్నట్లు తెలిపారు. వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి పాల్గొంటారన్నారు.